
విజయ మాలతి



'అమ్మ' అన్న పిలుపుకి వెనక్కి తిరిగింది పూర్ణ ఎవరా అని.

అప్పటికి హాలంతా ఖాళీగా వుంది. జనం యింకా రాలేదు. తన వెనుకకుర్చీమీద ఒకావిడ కూర్చొంది. నలభై ఏళ్లుంటాయి. నుదుట నయాపైసంత బొట్టు.

పెదాలపై చెరగని నవ్వు. ఆ నవ్వు చూస్తుంటే రత్న గుర్తుకొచ్చింది పూర్ణకి. రత్న అంతే. ఎంత చక్కగా నవ్వుతుంది. కాని ఇక్కడికు ఎలావస్తుంది? ఆవిడ భుజం చుట్టూ చేతులువేసి 25 ఏళ్ళయువకుడు దగ్గరగా ఒంగొని ఏదో చెప్తున్నాడు. బహుశ అతను పిలిచివుంటాడు. 'అమ్మ' అని.

తను అలా చూస్తే వాళ్ళేమనుకుంటారో అని తల వెనక్కి తిప్పుకుంది. కాని ఆ దృశ్యం చెరగలేదు మనస్సులోంచి మాత్రం.

వెంటనే తన కొడుకు జ్ఞాపకం వచ్చాడు.

బాధతో పూర్ణ హృదయం మూల్గింది. ఆవిణ్ణి ఎక్కడో చూసినట్లు అనిపించింది. ఎక్కడ చూశానా? అని ఆలోచించింది కాసేపు.

అవును, రత్నే. సందేహంలేదు. వెనక్కి తిరిగి మళ్ళా ఒకసారి చూసి పిలిస్తే తెలుస్తుందిగా అనుకొని "రత్నా" అనిపిలిచింది.

ఆవిడ తలెత్తి చూసింది గాని తనని గుర్తుపట లేదు.

"నేను రత్నా! పూర్ణని, గుర్తుపట లేవూ" అంది.

"పూర్ణా, నువ్వా!" అని ఆశ్చర్యపోయింది రత్న. గబగబలేచి పూర్ణ ప్రక్కన కూర్చుంది. పూర్ణ రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసికొని ఆప్యాయంగా నిమిరింది రత్న.

"పూర్ణా ఏమిటి అలా చిక్కిపోయావు. ఆరోగ్యం సరిగాలేదా?" అని ఆదుర్దాగా ప్రశ్నించింది రత్న.

"నాకేం, బాగానే వున్నా! నువ్వు బాగున్నావా? ఇక్కడకు వచ్చి ఎన్నేళ్ళయింది?" అంది. ఆ కంఠ స్వరంలోని నీరసం దాచలేకపోయింది పూర్ణ.

"వచ్చి యేడాదైంది. వాసు 'హవుస్ సర్జన్' చేస్తున్నాడు."

"చూశావా! నేను వచ్చి రెండేళ్ళయింది. ఇన్ని రోజులు యిక్కడవున్నా, ఈరోజు ఇలా కల్సుకోవాల్సి వచ్చింది. ఎంత విచిత్రం!"

కాసేపు ఎవరూ మాట్లాడుకోలేదు. ఎవరి మనసుల్లో వాళ్ళు, వాళ్ళ చిన్ననాటి ఆటపాటలు వాళ్ళకు తెలియకుండానే గుర్తుకు వస్తున్నాయ్.

కాకినాడప్రక్క చిన్న పల్లెటూరు వాళ్లది. ప్రక్క ప్రక్క యిళ్ళు. రత్నకి ఎవరూలేరు. వాళ్ళతాత దాన్ని పెంచి పెద్దచేశాడు. పూర్ణ రత్నకంటే రెండు మూడేళ్ళు చిన్న. ఏ పని చేసినా యిద్దరూ కలిసిచేసే వాళ్ళు. మాధవుడి గుళ్లోపడ్డ బొగడపూలు అందరి పిల్లలకంటే ముందుగ వచ్చి పెద్దపెద్ద దండలు కటి బొమ్మలాటలాడే వాళ్ళు. రాత్రి పడుకునే ముందు రత్న తాత చెప్పేకథలు వినడంతో ఆరాత్రి గడిచేది. పూర్ణకి తల్లి తండ్రి తమ్ముడు వున్నారు. ఇద్దర్ని చూసి వూళ్లోవాళ్ళు ముచ్చటపడేవాళ్ళు. తెల్లగా బొద్దుగావుండే పూర్ణ ముద్దుగావుండేది. రత్నది చామనచాయ. అమ్మాయిఅందంఅంతా ఆనవ్వులోనే వుండేది. రత్న తాతయ్య తాను బ్రతికివుండగానే రత్న పెళ్ళిచెయ్యాలని, అలాగే సంబంధం చూసి చెన్నపట్నంలో గుమాస్తాగిరి చేస్తున్న సుందరానికిచ్చి చేశాడు. రత్న వెళ్లేరోజు ఇద్దరు వదలలేక వదలలేక ఏడ్చారు. వాళ్ళను నా చేతులారా విడదీస్తున్నానని వలవలలాడాడు.

ఆ తరువాత రెండేళ్ళకి పూర్ణకి కూడా వివాహ

మయ్యింది. పుటింటికి వచ్చేముందు యిద్దరు కూడ బలుక్కొని వచ్చేవాళ్ళు. తాత పోవటంతో రత్నకి ఆవూళ్ళో వున్న ఒక సంబంధం తెగిపోయింది. పూర్ణకి కూడ ఆ వూరికి రావటమే పడేదికాదు. వాళ్ళ మధ్య వుత్తరాలు జరిగాయి కొంతకాలం. అవీ ఈ మధ్య ఆగిపోయాయి. ఎవరిగొడవల్లో వాళ్ళుండి పోయారు. మళ్ళా యిన్నేళ్ళకి కల్సిన ఆ స్నేహితుల హృదయాలు వెనుకటి మధురమైన రోజులలో మైమరచి పోతున్నాయి.

"ఇప్పుడెక్కడ వుంటున్నారు?"

ఇద్దరు ఒకేసారి అడిగి ఒకేసారి నవ్వుకున్నారు. పెద్దవాళ్ళమన్న ధ్యాస ఇద్దరిలో లేదు. అందుకే అంత హాయిగా నవ్వుకున్నారు. ఇద్దరితో ఎన్నో చెప్పుకోవా లన్న ఆతృత యిద్దరి మనస్సుల్లో తొందర చేసింది.

"ఒన్! ఏమిటిది?" అన్న పిలుపుకి యిద్దరు వులిక్కిపడి చేతులు తీసేసుకొన్నారు. జనం చాలా మంది వచ్చారు. ఎవరిసీట్లలో వాళ్ళు కూర్చొన్నారు. హాలంతా రణగొణ ధ్వనిగావుంది.

"అరె! ఇంతజనం ఎలా వచ్చారు?" అందిపూర్ణ.

"మనగొడవల్లో మనంవుంటే ఎలా తెలుస్తుంది" అంది రత్న నవ్వుతూ.

"నాటకాలకి ఎప్పుడూ వస్తావా?" అంది పూర్ణ మెల్లిగా రత్న చెవి దగ్గరకు వచ్చి.

"మా వాడి బలవంతాన వచ్చా. వాడు సెక్రటరీ, పైగా వాడురాసిన నాటకం. అందుకే వచ్చా!"

"సరే, రాంబాబు ఎక్కడ?"

పూర్ణ ముఖం ఒక్కసారి పాలిపోయింది.

"ఏమిటి అలా అయ్యావు! రాంబాబు కులాసానా" అంది రత్న.

"కులాసానే" అంటూ తలూపింది. వాడు హైద్రాబాద్‌లో ఇన్‌కంటాక్సు ఆఫీసరు" అంది కాని ఆ కంఠం జీరపోయింది.

అసలు మునుపటి పూర్ణ కాదు. దాని అందం అంతా ఆయనతోనే పోయిందనిపిస్తుంది. కానియింత చిక్కి శల్యమైన తన పూర్ణని ఆ స్థితిలో చూడాల్సి వచ్చినందుకు రత్న బాధపడింది. ఏదో అడగబోయి నది.

"అంతా నిశ్శబ్దంగా వుండాలి. ఇంకా కొన్ని నిముషాల్లో నాటకం బిగిన్ చేస్తారు. అనుకున్న టైంకి లేటు అయినందుకు క్షమించమని ప్రార్థన"అంటూ ఒక యువకుడు స్టేజిమీదకు వచ్చి చెప్పాడు.

"పూర్ణా! వాడే వాసు" అంది రత్న.

"అరె! ఇతనేనా, మా యింటికి వచ్చి టికెట్ అంటగట్టింది."

నాకు యితన్ని చూడంగానే నువ్వు గుర్తుకు వచ్చావు. కాని మనుషులబోలిన మనుష్యులుంటారని అడగలా, ఆతని మాటలే నన్ను టికెట్ కొనిపించాయి. నిజం చెప్పనా? ఒకసారి అతని మాటలు వినాలని, అతన్ని చూడాలనీ ఎప్పుడూరాని నేను ఈ నాటకానికి వచ్చా." అందిపూర్ణ.

"అమ్మా"

పూర్ణ అటు తిరిగింది ఆ పిలుపుకి. అది అతన్ని పిలిచినట్లనిపించింది. "అమ్మ"అన్న పిలుపుకి ఎందుకు తను ఆతృత పడుతోందో తనకే తెలీదు.

నాటకం, రచన, నిర్వహణ.... వాసుదేవరావు.నటీ నటులు అంటూ అతను చెప్పుకు పోతున్నాడు.

ఒకసారి పూర్ణ బరువుగా వూపిరి పీల్చింది. ఆ తరువాత ఆమెచెవిన పడలేదు.

స్టేజి అంతా చీకటిగా వుంది. ఒకలైటు వెలిగింది. స్టేజిమీద ఒకప్రక్కగా ఒతకను నిలబడి బట్టలు సర్దుకొంటున్నాడు. అతను చాల హడావిడిగా ఏదో ప్రయాణ సన్నాహాల్లో వున్నట్లు కన్పించాడు. అతని కాళ్ళదగ్గరగా ఒకామె కూర్చొని వుంది. ఆమె ముఖం అంత స్పష్టంగా కనబడుటలేదు.

"చిన్నా! నా మాటవిను బాబూ!"అంటూ ఆవిడ లేచి చిన్నవేపుకి నడిచింది.

"అవసరం లేదు" అంటూ విసురుగా సూటుకేసు మూతవేసి ఆమెను దాటుకుంటూ అవతలకు వెళ్లాడు.

"నిజమే నాయనా! నా అవుసరం నీకు లేదు." అంటూ విరక్తిగా నవ్వింది. 'నీకు రెక్కలు వచ్చేవరకే నా అవుసరం. నీకు రెక్కలువచ్చాయి. నా అవుసరం లేదు. రెక్కలు వచ్చిన పక్షి ఎగిరినట్లు నన్ను వదలి వెళ్ళి పోతున్నావు. నేను ఈనాడు ఏమైనా నీకు అఖ్కర్లేదు."

"నువ్వు చేసిన దానిని మర్చిపోయేటంత కృతఘ్నుడ్ని కాదులే"అంటూ ఒక కట్టడబ్బు ఆమెముందు పారేశాడు.

అవి సేజి మీద చిందరవందరగ పడ్డాయి.

ఆమె అవన్నీ ఏరింది. ఆడబ్బు తీసికొని అతని ముఖం దగ్గరకు తెచ్చింది.

"నా విలువ ఈ రూపాయల్తో కొలిచావన్న మాట" ఆవిడ కళ్ళు ఎర్రగ జ్యోతుల్లాగ భగభగ మండుతున్నాయి. 'నా విలువ వంద రూపాయలు.' ఒకసారి బిగ్గరగా నవ్వింది. ఆ నవ్వు ఏడ్పులోకి దిగింది. ఒక్కసారి ఎక్కెక్కి ఏడ్చింది.

"ఒక్క విషయం గుర్తుంచుకో చిన్నా! నిన్ను యింత పెద్ద ఆస్థిపరుణ్ని చేసి నీవున్నతికి పాటు పడింది, నా విలువ డబ్బుతో వెల గట్టేందుకు కాదు నాయనా. కేవలం నువ్వు పిలిచే "అమ్మ" అన్న పిలుపు కోసం అంతే. అంతకు తప్ప నీవు నన్ను అందలం ఎక్కిస్తావని, డబ్బుతో ముంచెత్తుతావని కాదు. ఈనాడు నిన్ను కన్న నా హృదయం సిగ్గుతో చితికిపోతుంది."

ప్రేక్షక హృదయాలన్నీ ఆవిడ బాధను తాము కూడ పంచుకొన్నట్లు హాలంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని ఆవిడ వెక్కిళ్ళు విన్పిస్తున్నాయి. ఎవరూ అది నాటకం అనుకోవటం లేదు. అది తమ ఎదుట నిజంగా జరుగుతున్నట్లు నటీనటులు చేస్తున్నారు.

"చిన్నా! వెళ్ళేముందు ఒక్కమాట. ఇది నీ నీ యిల్లు. ఇప్పుడు నీ అత్తారింటికి వెళ్ళినా వాళ్ళు నిన్ను చిన్నచూపు చూడవచ్చు. అది నేను భరించ లేను. నీకు లేని గౌరవమును కొనే నీవాళ్ళను ఇక్కడకు పిల్చుకొని నువ్వుండు. నా బ్రతుకులో చాల భాగం అయిపోయింది. నేనింకా కొన్నాళ్ళు ఎక్కడ వున్నా బ్రతుకగలను. ఇదిగో ఈ డబ్బు దేనికన్న అవసరానికి వాడుకో. కన్నతల్లి ఋణం 'వంద' రూపాయల్తో తీర్చివేసిన నిన్ను కన్న నా హృదయం ఆనందంతో పొంగిపోతోంది. ఎక్కడ వున్నా నీకు దేముడు మేలు చేయాలని ప్రార్థిస్తున్నా. భగవంతుడా! ఏ స్త్రీకి యిటువంటి స్థితి కల్పించకు." అంటూ ఆమె వెళ్ళిపోయింది. అతను డబ్బు పటుకు అలాగే నిలబడుతాడు. కరన్ వేశారు.

పూర్ణ తన పమిట కొంగు నోట్లో కుక్కుకొని బయటకు వెళ్ళిపోయింది. రత్న ఒక్కసారి ఆశ్చర్య పోయి పూర్ణ వెనకాలే వెళ్ళింది.

హాలు బయట కార్లు, రిక్షాలు, సైకిళ్ళు అన్నీ ఆగి వున్నాయి. ఇంకా నాటకం కాలేదు. కొంతమంది గాలి కోసం బయటకు వస్తున్నారు, వెళ్తున్నారు.

పూర్ణ రత్నకి ఎక్కడ కన్పడలేదు. అసలు ఎక్కడికి వెళ్ళింది? కంగారుపడి ఇంకా ముందుకు నడచింది. సినిమా హాలుకి ముందున్న తోటలో వున్న లైటు వెలుగులో ఒకస్త్రీ ఆకారం కనబడి గబగబ అటు నడచింది. పోక చెట్టు నానుకొని తన రెండు మోకాళ్ళు ముందు పెట్టుకొని ఏడుస్తోంది పూర్ణ.

"పూర్ణ! ఏమిటది! నాటకం చూసి నే అను కున్నా ఇందాకటి నుంచి. ఏదో వుంది. నాకు చెప్పవూ?" అంది.

పూర్ణ ఏమీ మాట్లాడలేదు.

"పూర్ణా, లే జనం చూస్తే బాగుండదు. లే" అంటూ మెల్లిగా పూర్ణను లేవదీసి కారు పార్కింగ్ ప్లేస్‌కి వచ్చి తన కారు దగ్గర ఆగింది.

బీడి కాల్చుకుంటున్న డ్రైవరు అమ్మగార్ని చూసి బీడి పారేసి డోర్ తీశాడు. పూర్ణని ఎక్కించి పూర్ణ ప్రక్కన కూర్చొంది.

"పూర్ణా మీ యిల్లెక్కడో చెప్పు" అంది.

పూర్ణ చెప్పింది.

అమావాస్య వెళ్ళి రెండు రోజులైందేమో చంద్రుడి సన్నటి కాంతి భూమి వరకు చేరనట్లు చీకటిగా వుంది. కారు మెల్లిగా రోడ్డుని విం గేస్తూ మనుష్యులను, కార్లను తప్పించుకుంటూ ప్రయాణం సాగిస్తోంది.

"అదిగో ఆ చిన్నగేటువున్న ఆడాబా ముందాపు" అంది, మొదటిసారిగా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

డ్రైవరు యింటిముందు కారాపాడు. ఇద్దరూ కారు దిగారు.

"చిన్నబాబుతో చెప్పు. నేను యిక్కడ వున్నట్లు" అంది రత్న. డ్రైవరుతో. కారువాళ్ళను వదలి వెళ్ళి పోయింది.

వీధిలైటు వెలుగు వరండా మీదపడుతోంది. సన్నటి గాలికి కాంపౌండులో చెట్లూగుతున్నాయి. సన్నజాజి పందిరి ఎక్కడానికి తగిన ఆధారంలేక క్రింద పడిపోయివుంది. దానిపూలు ఆరాత్రి నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ఆపందిరి కిందచిక్కుకు పోయిన తనపిల్లలను బయటకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది పిల్లి. పూర్ణముందుకు వంగి మెల్లిగా తీగను కదిపి ఆపిల్లను బయటకు తీసి ఇవతలకు పెట్టింది. ఆపిల్లిపిల్లలను నోటికి కరుచుకు పోయింది తల్లి.

# మమత

అల్లాగే చూస్తూ నిలబడి పోయింది పూర్ణ.

"చూశావా రత్నా! ఆచిన్న పిల్లలను కాకులు పొడవకుండ, కుక్కలు ఎత్తుకు పోకుండ కాపాడు తోంది కదా ఆపిల్లి. తరువాత ఆచిన్న పిల్లిదాని ముఖమే చూడదని దానికి తెలియదుకదా" అంటూ తాళం తీసి, లైటు వేసింది యింకా నిలబేశక్తి లేనట్లు. గుర్చీలో కూలబడి ఎదురుగా వున్న టేబిల్ మీద తలవాల్చుకుంది.

రత్న చుట్టూ చూసి స్టూలుమీదున్న కూజాలో మంచినీళ్ళు వంచి పూర్ణ కిచ్చింది.

"రాకరాక యింటికి వచ్చిన నీచేత చేయిస్తున్నా'

"నీది నాది అని అంటూ మన మధ్య ఏనాడన్నా వుందా? ఎనిమిది అయినట్లుంది. భోజనంచేసి కాసేపు విశ్రాంతిగా పడుకో" అంది రత్న.

"నేభోజనం మాని చాలరోజులయ్యింది. అదిగో అరాక్‌లో వున్న అరటిపళ్ళు— స్వీకృతే."

"అరటిపండ్లు తిని కాఫీ త్రాగు" అంది నవ్వుతూ పూర్ణ, 'అందుకే ఎలా తయారయ్యావో చూడు నాకంటే చిన్నదానివి. అసలు పూర్ణ అంటే నువ్వు కాదనే అనిపిస్తున్నావు."

"నేనెలా వుంటేఏం? ఎవరికోసం బ్రతకాలి చెప్పురత్న."

"అప్పుడే అంతవిరక్తి కల్గిందా జీవితం మీద పూర్ణా, ఒక విషయం అడుగుతా చెప్పు. నిన్ను చూసినప్పుడే గ్రహించా నీమనస్సులోని బాధ. నన్ను కూడ పంచుకోని బంది" పూర్ణతలని నిమురుతూ.

"రత్నానీకు తెలియని రహస్యాలు నాకు ఎన్నడు లేవు. ఇన్నాళ్ళ నామనస్సులో గూడుకట్టుకున్న బాధ ఈనాడు కరిగిపోయింది." అంటూ రత్న వడిలో తల దాచుకుంది.

పూర్ణ తలని రత్న తన చేతులతో నిమురుతూ వుండిపోయింది. పూర్ణని ఈస్థితిలో చూడాల్సివ వచ్చినందుకు రత్న కళ్ళలో నీళ్ళు తిరిగి పూర్ణ తలమీద పడి ఇంకి పోయాయి.

ఎన్నాళ్ళనుండో ఆప్యాయతకు నోచుకోని పూర్ణ హృదయం రత్న మాటలకే కరిగిపోయి రత్న వడిలోని వెచ్చదనం అనుభవిస్తు వుండి పోయింది. పూర్ణని అలా చూస్తే రత్నకి తన చిన్నబిడ్డలా అనిపించి ఆప్యాయంగా శుష్కించిన ఆచేతులను బలంగా పట్టుకొంది. కాని ఆచేతులు ఏమి చల నం లేక పోయేసరికి రత్నకి భయం వేసింది.

"పూర్ణా" అంటూ మెల్లిగ తన వడిలోంచి తల తీసింది. పూర్ణకళ్ళు మూసుకు పోయివున్నాయి. ముక్కుదగ్గర వేలుపెట్టింది. ఊపిరాడుతోంది. ఫిట్ వచ్చినట్లుంది. పూర్ణని తనచేతులతో మంచం మీద పడుకో బెట్టింది. గబగబ నీళ్ళుతీసి ముఖంమీద చల్లింది. ఫ్లాస్కులోని కాఫీ మెల్లిగా చెంచాతో పోసింది. కొద్ది సేపటికి పూర్ణ కనులు రెపరెపలాడాయి. నుదుటినిండా చెమట పట్టింది. ఆచెమటని తన పమిట కొంగుతో తుడిచి, పేపరుతో విసర సాగింది. కొద్దిసేపటికి తేరుకొంది పూర్ణ.

"భయపడ్డావా" నీరసంగా నవ్వింది పూర్ణ.

"లేదు. సంతోషించా. ఎన్నాళ్ళనుంచే నీకు ఇట్లా. ఇట్లాంటి దానివి ఒక్కదానివి ఎలావున్నావు? ఆ రాంబాబు ఎక్కడ?" కోపంగా అడిగింది రత్న. ఆకోపంలో ఆప్యాయత ఎక్కువ ధ్వనించింది.

"పిచ్చిరత్నా. ఇందాక నాటకం చూడలా. ఆనాటకంలో ఆతల్లి పోర్షన్ నాదేనే" అంది.

"అంటే"

"అంటే" ఏముంది? నాబాధ్యత నేనెరవేర్చు కున్నా. వాడికి నాబాధ్యతలేదు. అందుకే దిక్కు లేకుండా ఇక్కడ పడివున్నా. అద్దాలలోనే బిడ్డలు అనేసామెత లేదూ అంతే" అంటూ గుండెపట్టు కొంది. ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది.

కళ్ళు ఎర్రగా వున్నాయ్. కన్నీళ్ళచారికలు పాలి పోయిన చెక్కిళ్ళ మీద లైటు వెలుగులో పడి మిలమిల్లాడుతున్నాయి.

"ఏమయ్యింది".

"కాస్త గుండె నొప్పి"

"నే డాక్టర్ని పిల్చుకొస్తా".

"వద్దు రత్నా. నన్నింటరిదాన్ని చేసి వెళ్ళకు. ఎన్నాళ్ళకో కనబడ్డావు. నిన్ను వదలి ఈస్థితిలో వుండలేను" అంటూ ఏడ్చింది పూర్ణ.

ఏనాడు కంట తడిఎరగని పూర్ణ ఏడుపు ఈరోజుచూసి ఆశ్చర్య పోయింది రత్న.

"నా ఏడుపు చూసి ఆశ్చర్య పడుతున్నావా?"

తనమనస్సులోని మాట పూర్ణ చెప్పేసరికి తలెత్తి చూసింది రత్న.

"నిజంచెప్పనా. ఏడుపు ఏడ్వడానికి కూడ అప్పుడు శక్తి లేదు. ఈరోజు నాలోని బాధను పంచు కొనే నిన్ను చూడంగానే కళ్ళలో ఆపుకోని ప్రవా హం. దానికి ఆనకట కట లేను" అని గుండెలమీద రాస్తున్న రత్న చేతులను పటు కొంది.

"ఇన్ని జబ్బులు పెటుకొని ఒక్కదానివే ఎందుకుంటున్నావ్.

నేను చెప్పింది. నమ్మలేవా రత్నా? నీకొడుకు లాంటివాడు కాదు రాంబాబు" అంటూ మంచినీళ్ల కోసం సంజ్ఞచేసింది.

రత్న పూర్ణచేయి ప్రక్కనపెటి లేచి కాసిని మంచినీళ్ళు యిచ్చింది.

"పూర్ణా రాంబాబుకి వైరివ్వనా?

"వద్దు రత్నా! ఆపని చేయకు. నన్నింకా అవ మానం పాలు చేయవద్దు."

"అవమానమా"

"నాకు జరిగిన అవమానాలు చాలు రత్నా. ఆయన పోయేటప్పటికి రాంబాబుకి రెండేళ్ళు. ఆయన పోవడం, నీవుచెప్పిన ఓదార్పు మాటలు మళ్ళీ వాడికోసం బ్రతకనున్నాయి."


బరువుగా నిటూర్చింది.

"పూర్ణాయిప్పుడు వద్దు. కాస్త విశ్రాంతి తీసికో".

"రత్నా! నన్ను ఆపకు. ఇన్నాళ్ళు ఎవరికీ చెప్ప లేదు. ఇంక నీకు చెప్తా. ఇక దాన్ని ఆపే శక్తి నీకూ నాకూ లేదు".

ఇంక పూర్ణని ఆపలేననుకున్న రత్న వూరు కుంది. మెల్లిగా పూర్ణ గుండెలను రాస్తూ పూర్ణ చెప్పేది వినసాగింది.

"పుటిన నాటినుంచి రాంబాబు కి ఏదోఒకి జబ్బు. కంటినిండా నిద్ర, వొంటికి తిండి ఎరగను. ఎప్పుడు నిద్ర పోతానా అని ఎదురు చూసే దాన్ని. అట్లా వాడిని పదేళ్ళవరకు పెంచా. వారి ప్రావిడెంటు ఫండు, ఇంటి అద్దె, మిషన్ కుట గా వచ్చిన ఆడబ్బులతో వాడిని చదివించా. రాత్రిళ్ళంతా మిషన్ కుటి ఆనాడు తిండికి బట కీ నోచుకోలేదు. ఇదెందుకు చెప్తుతున్నానో తెలుసా. నాకొడుకు పెద్ద ఆఫీసరయి ఒక వున్నత స్థానంలో వున్నప్పుడు కూడ నేను నిద్రకి ఆరోగ్యానికి దూరం అయి ఏప్పుడా వాబ్రతుకు తెల్లారేదని ఎదురు చూస్తున్నా".



# మమత

కళ్ళనీయిక వినలేక పోయింది. 'వద్దు పూర్ణా చెప్పకు,' అంది.

"రత్నా యిదేనా నువు చూసింది. ఇక ఎవరికి చెప్పను? చెప్పితే నా కొడుకును తిట్టుకుంటారు. అది ఈకన్న తల్లి భరించలేక పోయేది. సరే ఆతరువాత విను."

వాడు ఏదికోరితే అది కాదనలేదు. పదిమందిలో నాకొడుకు చిన్న బుచ్చుకో కూడదని వాడికి మంచి బట్టలు కొనేదాన్ని. ఏనాడూ వాడికి ఏలోటూ రానివ్వలేదు. 'అమ్మా' అని వాడు నామెడ చుట్టూ తన చిన్న చేతులతోచుట్టి తన కబుర్లతో నన్ను ఆనందపర్చేవాడు. అంతే. ఆనాడే మానందం అనుభవించానో అంతే. అది తల్చుకున్న నాకళ్ళకు ఇప్పటికీ ఆ దృశ్యము ఈ రోజు జరిగినట్లనిపిస్తుంది. ఇన్నాళ్ళు అది తల్చుకొనే బ్రతికాను. ఉన్న నగలన్నీ అమ్మి చదివించా. కాలేజీలో చేరే వరకు వాడిప్రపంచం నాదే.

కాని ఆతరువాత వాడినోటినుండి 'అమ్మా' అన్న పిలుపుకే ముఖం వాచిపోయాను. వాడిని చూసి నేను అన్నం పెట్టాలి. వాడినోటితో 'అమ్మా అన్నం' అని ఏనాడు అడుగలేదు.

ఆలోచించు రత్నా, నా ఆశ, నాసర్వస్వం వాడే అనుకొని బ్రతికాను. వాడే నన్ను దూరంచేస్తే నాహృదయం తట్టు కో గలదా?"

రత్నకి తనకొడుకు వాసు గుర్తొచ్చాడు. వాసుని కన్న తను నిజంగానే చాల అదృష్టవంతురాలు. ఇప్పటికి వాడికి పెళ్ళైనా తనే అన్నం పెట్టాలి. "అమ్మ, అమ్మా" అని వాడి పిలుపుకి అంతే వుండదు.

"శారద పెడుతుంది భోజనం చేయరా" అంటే

"అమ్మా శారద ఇప్పుడు వచ్చింది. నేనెంత తినేది, ఏమి తినేది దానికెలా తెలుస్తుందమ్మా" అంటాడు.

అప్పుడు తానెంత గర్వ పడేది.

"రత్నా ఏమిటాలోచన? బహుశా వాసు గుర్తొచ్చాడు కదూ!"

"నిజమే పూర్ణా. ఇప్పుడనిపిస్తోంది. వాసు కులా ప్రవర్తిస్తే ఏనాడో నాగుండాగి పోయేదేమో.'

గాలికి తలుపు రెక్కలు టకటక కొట్టు కొంటున్నాయి. చల్లటి గాలి లోపలికొస్తోంది. మూల గోడకున్నసాలెగూడు లైటు వెలుగులో భయంకరంగా వుంది.

రత్న లేచి కిటికీలు కొట్టు కోకుండ అడ్డు పెట్టింది.

పూర్ణ గోడకు దిండానుకొని మెల్లిగ కూర్చుంది.

"రాంబాబుకి పెళ్ళి చేశావా?" అని అడిగింది రత్న.

"ఆ. వాడికిష్టమైన అమ్మాయినే చేశాను. రోజూ అన్నం పెట్టే యిది కూడ నాకు లేదు. భార్యని చాలా ఆప్యాయంగా పిలిచేవాడు. నన్ను పిలవడానికి వాడి నోరు రాదు. వాడంత సంపాదించినా ఏనాడు నా దగ్గరకు వచ్చి "అమ్మా ఇది తినమ్మా' అని చిన్నపండు నా చేతుల్లో పెట్టిన పాపాన పోలేదు. వాడి భార్యకు ఎన్ని తెచ్చి నాకు తెలియకుండా ఇస్తున్నాడో నాకు తెల్సు. ప్రతిరోజూ రంగి పూడ్చిన చెత్తలో అన్నీ కనబడేవి. అది కూడ సహించా వాడ్ని కళ్ళతో అయినా చూడవచ్చు అనే ఆశతో."

రత్న దృష్టికి వాసు కనబడుతున్నాడు. ఏది తెచ్చినా ముందు తనకిచ్చి తను తినేంత వరకూ చంపే వాసు కనబడుతున్నాడు. వాసు మారడు, మారలేదు కూడ.

"నాకు గుండెజబ్బు అప్పుడే ప్రారంభమయ్యింది. అమ్మా మందు వేసుకున్నావా? ఇదిగో మంచం వేస్తున్నా పడుకో. క్రింద వద్దు." అని ఒక్కసారి తన నోటితో అంటె ఈ గుండెనొప్పి నాకు వుండేనా రత్నా."

ఒకసారి నా కోడలికి తలనొప్పి వచ్చింది. వాడు స్వయంగా రిక్షాలో తీసికొని వెళ్ళాడు. తన చేతులతో పక్క పరిచి పడుకోబెట్టాడు.

"రత్నా! నాకోడలికి ఎందుకు చెయ్యాలి. అని నేనమట లేదు. వాడి భార్య మీద ప్రేమ చూపవద్దనను. నీ పూర్ణకి అలాటి బుద్ధిలేదని నీకు తెల్సు. కాని వాడికి నే గుర్తున్నానా అనే బాధ నన్ను పీల్చి పిప్పి చేస్తోంది." అంటూ చెప్పలేక ఆగిపోయింది.

"పూర్ణా! కాసేపు విశ్రాంతి తీసికో."

"రత్నా! యింకా ఎంతో లేదు. అయిపోయింది. మళ్ళీ నా కవకాశం వస్తుందో రాదో? అభయమే నాకు చెప్పాలనిపిస్తోంది."

"వాడి భార్యగారి తాలూకు బంధువులతో మా యిల్లు ఎప్పుడూ కలకల లాడుతుండేది. చూసేవారికి బుద్ధిమంతుడైన కొడుకును కన్న అదృష్ట వంతురాలిని." అంది వింటూ నా బాధలను నా నవ్వు వెనక దాచి, ఎంతో హాయిగా నవ్వేదాన్ని. దీనిలో వాడి తప్పు లేదు. నా ఖర్మ ఇంతే. అదే అనుకొన్నా. కాని చివరికి వాడు నన్ను శత్రువు లాగ చూశాడు. అది సహించలేక పోతున్నా రత్నా."

"సరే! ఇట్లాంటివి ఎన్ని చెప్పినా తరగవు. కాని ఆరోజు నాకు బాగా గుర్తు. అది తల్చుకుంటే ఈరోజు జరిగినట్లనిపిస్తుంది. రాంబాబు, సీతా యిద్దరు వాడి భార్య తాలూకు వాళ్ళింటికి డిన్నర్‌కి వెళ్ళారు.

ఆరోజు ఉదయం బాగానొప్పి వచ్చింది. వాళ్ళు డిన్నర్‌కి వెళ్ళక తప్పదు. వాడేం చేస్తాడు చెప్పు. వెళ్ళకపోతే బాగుండదు. కాని ఆ నొప్పిలో చచ్చి పోతానేమోననిపించింది. వాడ్ని చూడనేమో చివరి సారిగా అని బెంగ. కాని ఈ దిక్కుమాలింది అప్పుడు చావలేదు రత్నా. వాడిని నా దగ్గరగా వుంచుకోవాలని బలంగా అనిపించింది. అందుకే నా సిగ్గుని చంపుకొని "రాంబాబు, కాసేపు వుండలేవా?" అని వాడి చేతులు పట్టు కొని ప్రార్థించా.

"ఎప్పుడూ వుండేనొప్పేగా! దానికింత బ్రహ్మాండం చేస్తారేం?" అంది నవ్వుతూ నా కోడలు.

నేను ఏమీ మాట్లాడలా. రాంబాబు వంకే ఆశ్రతగా చూస్తూ.

"పోనీనొప్పి వుండవచ్చనుకోండి. అదిపెద్దవాళ్ళింట్లోనాయె. వెళ్ళకపోతే బాగుండదు. ఏమంటారు —మీరు" అని రాంబాబుని అడిగింది.

"అవునమ్మా! తప్పదు." అన్నాడు వాడు.

అప్పుడు నిజంగా ఎంత సిగ్గుతో చచ్చిపోయాననుకున్నావ్! నీకు తెలియదు రత్నా! వాళ్ళు వెళ్ళిపోయారు. ఒక మందు మాకులేక దిక్కులేనిదాని లాగ అలా ఎంతసేపున్నానో నాకు తెలీదు. అంత బాధలోనూ నువ్వు గుర్తొచ్చావు.

"అమ్మా!" అన్నపిలుపుకి కళ్ళెత్తి చూశా.

కోపంతో వూగిపోయే రాంబాబు నుంచున్నాడు. వాడ్ని యిప్పుడు తల్చుకుంటే భయంగా నావళ్ళు జలదరిస్తుంది. అయినా లేవలేకపోయా. కళ్ళెత్తి చేత్తో "ఏమిటన్నా?"

"ఎందుకు మేమంటే నీకంత కోపం? నువ్వు భోజనానికి వెళ్ళద్దంటే మానలేదనేగా, నా యింటికి వచ్చినవాళ్ళకి అవమానం చేశావు".

"అవమానమా? ఎవర్ని?" అన్నా బలవంతంగా లేచి కూర్చొని.

"సీతావాళ్ళోడిన పిన్నికొడుకు, కోడలు వచ్చారుట. కనీసం వాళ్ళు అడుగుతే మేము వున్నదీ లేనిదీ కూడ చెప్పలేదుట ఎందుకో" అంత బాధలోనూ నవ్వు వచ్చింది.

"రత్నా! నా తమ్ముడువస్తే మర్యాదకన్నా పలుకరించలేదు రాంబాబు. ఒకసారి వచ్చి వెళ్ళిపోయాడు. మళ్ళా నా గుమ్మంత్రొక్కలా. ఎంతడబ్బు లేకపోయినా, వాళ్ళకు ఆత్మాభిమానం వుంది. నేనప్పుడు అడుగలేదు. వాడి భార్య తాలూకు నౌకరు వచ్చినా ఎంతసరదాగా మాట్లాడుతాడో చెప్పలేను. తనతల్లి చచ్చేస్థితిలో తనని వుండమన్నా, చిన్నకోర్కె కాదన్నాడు."

'వాడి భార్య తాలూకువాళ్ళకి మర్యాద జరుగలేదని' అడగడానికి వచ్చాడు నా బాబు.

"నిజంగా ఆ నొప్పితో ఎలా వున్నానో నాకేతెలీదు. ఆ స్థితిలో ఎవరు వచ్చారో నాకే తెలీదు" అదే చెప్పా వాడికి.

"వాళ్ళు చాలసార్లు పిలిచారుటగా" వాడిమాటలు ధోరణిచూస్తే నేనే కావాలని వాళ్ళను అవమానం చేశానన్న భావం కనబడింది. నాలో సహనం పూర్తిగా నశించింది.

"ఈ నాటికి నువ్వు కన్న తల్లిని నమ్మలేకుండా వున్నావు. ఆనాడు నీసొంత మేనమామ వస్తే పలుకరించిన పాపాన పోయావా? ఇప్పుడు ఎవరో నీ భార్యకి దూరంచుట్టం వస్తే పలుకరించలేదని నన్ను అడగడానికి వచ్చావు, అయినా నాబాధలో వుండి గమనించలేదు."

"మేము నువ్వువద్దన్నా వెళ్ళామని నీకు మనస్సులో వుందనుకుంటా కదూ?" మళ్ళీ తిరిగి అదే రెట్టించాడు. ఇంతచెప్పినా వాడికి నామీద నమ్మకం లేదనిపించింది వాడి ధోరణి. ఎత్తిన నా చెయ్యి—

ఎంతో ప్రయత్నం మీద దించేశా.

"నాయనా ఈ చేతులతో పెంచానిన్ను. అందుకే ఈ చేతులతో నిన్ను కొట్టలేకపోతున్నా. నీచేత

చివర కీమాటలు అనిపించుకొనేవరకు నేను కదల లేదు. అదే బాధగావుంది" అన్నా. ఇక నాకక్కడ స్థానములేదనిపించి వెంటనే ఇక్కడకని వచ్చేశా" అంది పూర్ణ ఆమె ముఖంలో ఆనాడు అనుభవిం చిన బాధంతా చూడగలిగింది రత్న.

"వాడి చదువుకోసం, ఉద్యోగం కోసం ఒళ్ళుగుల్ల చేసికొని గుండెనొప్పి తెచ్చుకున్నావు. దానికి సరైన మందు యిప్పించాల్సిన బాధ్యత వాడికి లేదన్నమాట. దిక్కులేనిదానిలాగా అలా పడివున్న స్థితిలో తనవాళ్ళకు మర్యాద చెయ్యలేదని అడగడానికి వచ్చాడు. అసలు వాడు మనిషా? పశువా?" అంది కోపంగా రత్న.

"వద్దు రత్నా! వద్దు. ఎందుకు వాణ్ని తిడతావు? ఏంచేసినా వాడు నా కొడుకేగా."

"అవును. పాపం చాల బుద్ధిమంతుడు. నాకొడుకే అలా చేస్తేనా చెంపలు వాయగొట్టే దాన్ని".

"పిచ్చిరత్నా. అలా ఎప్పుడూ చెయ్యలేవు. నీకు ఆ అనుభవం లేదు. అందుకే అలా అనగలిగావు.

"ఇన్ని బాధలు మనస్సులో పెట్టుకొని ఎలాఅయిపోయావో చూడు. ఒక్కసారి నాకు వుత్త రం ముక్కరాయగూడదూ?"

"ఏమో రాయాలనిపించలేదప్పుడు."

"సరే అదంతా మర్చిపో! ఇంక నువ్వునాద గ్గరే వుండాలి. ఇంక ఈ విషయంలో నీమాట వినను.

"నేను కాదంటేగా రత్నా. వాసుకి పెళ్ళ యిందా?" అంది కుతూహలంగా పూర్ణ.

"నీ అనుమానం నాకర్థం అయ్యిందిలే. వాసు భార్య ఏమన్నా అనుకుంటుందనా? ఆభయం నీకు అక్కర్లేదు. ఒక్కవిషయం చెప్పనా. కొత్తలో శారద చాల గర్వంగా ప్రవర్తించేది. అయినా చిన్న పిల్లలే తర్వాత తర్వాత అదే తెల్సుకొంటుం దనుకొన్నా. దానికేదో చెప్పానమ్మా. గుర్తులేదు. మందుకే కాబోలు—"ఆ గూట్లోవుంది కాస్త ఇటు ఇవ్వనమ్మా" అన్నా.

"ఉండండి. పనిలోవున్నా. తర్వాత యిస్తా" అంది. చిరాకుగా ముఖం పెడుతూ.

ప్రక్కగదిలో వాసు వున్నట్లున్నాడు. ఒక్క సారి విసురుగావచ్చాడు. "శారదా! అమ్మతర్వాతే ఏదైనా. ముందు అమ్మచెప్పిన పనిచేసి తరువాత ఏవైనా నీపనులు చూసుకో. ఆపిల్ల అక్క ణ్నుంచి కదల లేదు.

నేను "వూరుకోరా. చిన్నపిల్ల నువ్వు. వెళ్ళు" అని వాడికెంతో చెప్పా.

"అమ్మా నువ్వూరుకో. శారదా! నీకు పెళ్ళి నాడే చెప్పా గుర్తు లేదా? నన్ను పెళ్ళిచేసు కున్నందువల్ల నాతోపాటు అమ్మ, నాన్నా నా తోబుట్టువులని నువ్వు ప్రేమించాలి. ఏనాడూ నే ఒకణ్నే నీకు చెందను. అది మర్చిపోక" అన్నాడు పూర్ణా!

ఆనాడు ఎంత ఆనందించానో చెప్పలేను. నువ్వు నమ్మవుకూడ. ఆచిన్న దానికి దానిచేత క్షమాపణ అడిగించాడు. ఆనాటినుంచి శారద ఎప్పుడూ అలా ప్రవర్తించలా.

"ఈకాలంలో వాసులాంటివాళ్ళు ఎవరూ


# సపట్

## లోషన్




తామర, గజ్జి, చిడుములకు నమ్మకమైన మరియు పేరుగాంచిన మందు.

SAPAT & CO., BOMBAY 2.

ఏజెంట్లు: ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్
బకింగ్‌హాం పేట, విజయవాడ—2.



# ఆరోగ్యము

బాగుగా ఉండేలా చూచుకొనుటకు
మీకు ముఖ్యమైన

# విటమినులు

మరియు

# ఖనిజ లవణములు

ప్రతిరోజు కావాలి...

Shilpi SC 53/67 Tel



వాటిని పొందుటకు ఒక

# విమ్‌గ్రాన్

బిళ్ల మాత్రమే చాలును

దీనిలో 11 ముఖ్యమైన విటమినులు మరియు 8 ముఖ్యమైన ఖనిజ లవణములు కలవు
ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది. విమ్‌గ్రాన్‌ను నేడే కొనండి!

SQUIBB SARABHAI CHEMICALS ® రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్కు

వుండరేమో? అన్నట్లు రెండురోజులక్రితము నీకొడుకు వచ్చాడు. టిక్కట్లు పటు కొచ్చాడు. అతన్ని అతని నవ్వును చూడగానే నువ్వుగుర్తొచ్చావు. ఏదో తెలియని ఆప్యాయత నన్ను అతన్ని కాసేపు నాదగ్గరే వుంచమంది.

అందుకే కూర్చోమన్నా. "అతను ఏవో నాటకాల గొడవలు అవిచెప్పి చివరికి ఒక టిక్కెటు కొనాలండి. పాపం. అనాథ పిల్లలకోసం డబ్బు ఉపయోగపడ్తుంది. తల్లిలాంటివారు మీరు. మీ సహాయం పూరికే పోదు" అన్నాడు.

"మరి ఏమవుతుందోయి" అన్నా.

"మీ పిల్లలు అభివృద్ధి కొస్తారు".

"అయితే తప్పకుండా కొంటా" అని 10 రూపాయలిచ్చి టికెట్ కొన్నా.

"కాఫీ తీసికొస్తా. కాసేపు కూర్చోగలవా బాబు?" అన్నా.

"కాఫీ ఎందుకండీ! ఇప్పుడు మీకు శ్రమ. మీచేత్తో కాస్ని మంచినీళ్ళుతెండి చాలు". అన్నాడు.

"ఎంత! రెండు నిమిషాల్లో అయిపోతుంది. నువ్వు కూర్చో" అని అతని ముందు ఒకపత్రిక పడేసి వెళ్ళాను.

కాఫీ కలిపి అతనికిస్తూంటే నా చేయి వణకిపోయింది. అతనిప్యాంటు మీద కాఫీ వలికింది. హడలిపోయా.ఇలాగే రాంబాబుకి మంచి నీళ్ళిస్తుంటే గ్లాసు జారి వాడి బట లు తడిశాయి. ఆరోజు నాలి హంగామా చేశాడు. ఎందుకోఆదిగుర్తు వచ్చి కంగారుపడిపోయా. నాకంగారు చూసి వాసు వచ్చాడు.

'ఎందుకండీ! అంత కంగారు. నేను మీ అబ్బాయినే అనుకోండి. అతని మీద మీరు పొంకబోస్తే ఏమంటాడు? కేక లేస్తాడా? అమ్మని వెయ్యలేడుగా? అంటూ ఫాంటు మీద ఒలికిన కాఫీని రుమాలుతో తుడుచుకొని "వస్తానండి" అంటూ వెళ్ళిపోయాడు.

"ఆనాడు అతన్ని కన్న తల్లెంత అదృష్టవంతురాలో." అనుకున్నా.

"ఈనాడు అలాంటి కొడుకును కన్నది నా రత్న అని గర్వపడుతున్నా." అంది పూర్ణ.

# మమత

"లే పూర్ణ వెళ్దాము" అంది పూర్ణా చేయి పటుకొని.

"అప్పుడేనా?"

"అప్పుడే ఏమిటీ? ఇప్పటికే లేటవుతే." అన్న కంఠస్వరం విని ఇద్దరు తలెత్తి చూశారు. గుమ్మాని కానుకొని చేతులు కటు కొని తెల్లని బట లతో, అంత కంటే చల్లగా నవ్వుతూ నిలబడ్డ వాసును చూసి యిద్దరూ ఆశ్చర్యపోయారు.

"నువ్వెప్పు డొచ్చావు వాసూ?" అంది పూర్ణ.

"ఎప్పుడైతే ఏంలే. నాకంతా తెల్సింది." అంటూ వాళ్ళిద్దరి మధ్యా మంచం మీద కూర్చున్నాడు.

"బహుశా నేనలా ప్రవర్తించి వుంటే అమ్మయిలా బాధ పడ్తుందని వూహించి రాశాను. కాని చిత్రము అలాంటి వారు వుంటారని నిన్ను చూసి తెల్సుకొన్నా. ఇల్లా, దిక్కు లేని దానివిగ వుండక్కర్లేదు. ఈ వాసున్నంత వరకు. నా కేమి బాధలేదు." అన్నాడు.

"లోకంలో కన్నకొడుకు కొడుకేకాదు వాసు. తల్లి హృదయానికి ఏకాస్తయినా ఆనందం కల్గించే వాడే నిజమైన కొడుకు. నువ్వు అన్నమాటలకి నే ఎలా అయిపోతున్నానో నీకు తెలియదు వాసూ." అంటూ వాసు చెంపలని ప్రేమతో నిమిరింది.

తన పూర్ణ ముఖం నిండు పౌర్ణమి లాగ వెలుగుతుంటే రత్న అలాగే చూస్తూ కూర్చుంది.

"అమ్మ పదండి. వెళ్దాం." అక్కడ నేవెవరికి చెప్పి రాలేదు. అయినా నాటకం యింకా పూర్తి అయి వుండదు." అన్నాడు వాసు.

"వద్దు లేరా. పదయింటికి." అంది రత్న.

"అమ్మా. అది వాసు రాసిన నాటకం. రెండున్నర గంట లుంటుంది. మధ్యలో మిమిక్రీ అంటూ పెటా రు. ఇంక అవదు. ముందు అసలు నే అక్కడకి వెళ్ళాల్సిన అవసరం వుంది. ఏ? అమ్మా? నువ్వు చెప్పు" అన్నాడు పూర్ణ వంక చూస్తూ.

"వాసూ! ఎప్పుడూ నీ పక్షమే నేను" అంది పూర్ణ.

"అమ్మ. నీవు కూడ మా పక్షానికి రాక తప్పదు. మీరు వెళ్ళి కార్లో కూర్చోండి. నే తాళం వేసి వస్తా." అన్నాడు టేబుల్ మీద తాళం తీసికొంటూ.

పూర్ణ, రత్న యిద్దరూ కార్లో కూర్చున్నారు.

"మై డియర్ క్రొత్తమ్మా! మీ యిల్లు చూసుకోవాలంటే యిప్పుడే చూసుకో! మళ్ళీ యిటు రాము!" అన్నాడు చిలిపిగా డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూ.

కారు ఐదు నిమిషాల్లో హాలు చేరుకొంది.

నాటకం యింకా కాలేదు. వాళ్ళు చూసిన దానికంటే జనం కిటకిటలాడుతున్నారు. ఇంక ఇటు లాభం లేదని సే జి దగ్గరకు తీసికెళ్ళి అక్కడ కుర్చీలో కూర్చోబెటా డు.

అప్పుడు వాళ్ళు చూసిన తల్లికొడుకులే సే జి మీద ఉన్నారు. కాని అప్పటి కొడుకు కాదతను అని అనిపించింది పూర్ణకి.

బట లు దుమ్ము కొటు కున్నాయి. గెడ్డం మాసి కళ్ళు ఏడ్చినట్లు ఎర్రగా వున్నాయి. జుట ంతాముఖం మీద పడింది. అతని ముఖంలో పశ్చాత్తాపం కొటి వచ్చినట్లు కనుపించింది.

ఆమధ్యలో ఏమి జరిగిందో పూర్ణకి, రత్నకి తెలియదు. అది వివరిసీను జరుగుతుందన్నారు, ఎవరో.

"అమ్మా! నన్ను క్షమించమ్మా! నీ విలువను డబ్బుతో కొలిచిన నాలాంటి వాడు ఎవరూ వుండరమ్మా."

చిన్నా తల్లికాళ్లను గటి గ పటు కొన్నాడు. లతని కళ్ళంబడినీళ్ళు ఆతల్లి పాదాలమీదపడి జారిపోతున్నాయి.

"లే చిన్నా! దీనిలో నీ తప్పేమీలేదు."

అంది అతనిని లేవదీస్తూ.

"కాదమ్మా, నీ హృదయం అమృతం. అందుకే నే చేసినది తప్పనిపించటంలేదు. కాని నువ్వు నన్ను క్షమించానంటే కాని నా మనస్సుకి శాంతిలేదు."

"అబ్బ!మొండి, సరే క్షమించాలే"అంటూ చిన్నాని లేవదీసింది.

"అమ్మా నీవెంత మంచిదానివి?" అంటూ ఆమె రెండుచేతుల్నీ కళ్ళకద్దుకున్నాడు.

కరె ను పడింది. పూర్ణ, రత్న అప్రయత్నంగా ఒకళ్ళ ముఖాలొకళ్ళు చూసుకొన్నారు.

వాసు సే జిమీదకి వచ్చాడు. నటీనటులను పరిచయంచేసి ఆ నాటకంలో తల్లీ, కొడుకులకు ప్రత్యేక బహుమతిలివ్వ దల్చుకున్నట్లు చెప్పాడు. ఆనాటి ప్రదర్శనకు వచ్చిన పదివేల రూపాయలు బీదవిద్యార్థులకు చెందుతుందని, తనకు సహాయ సహకారాలందజేసిన వారందరికీ కృతజ్ఞతలంద జేశాడు.

"చివరి సారిగా నా ఒక్క మాట" అని ఆగి తన గంభీర స్వరంతో అతి మృదువుగా—

"అమ్మ అందరికీ వుంటుంది. ఆ తల్లి మనస్సును సంతోషపెటే ప్రతిఒకళ్ళకి ఈ నాటకం నా హృదయపూర్వకంగా అంకితం చేస్తున్నా. ముఖ్యంగా మనకు అంటే —మగవాళ్ళకు అన్నాడు నవ్వుతూ.

ప్రేక్షకుల కరతాళాలమధ్య వాసుకి మంచి భవిష్యత్తు వుండాలని మనస్సులోనే ప్రార్థించింది పూర్ణ. ●

